కథ

# వధువుకావలెను !

-స్వామిచిత్రానంద

ఆంధ్ర, ఆరువేల నియోగి, గౌతమసగోత్రం - 45 సం॥ల యువకునకు వధువు కావలెను. బ్యాంకి, ఇన్సూరెన్సు లేదా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని అయి వుండాలి. ఇంగ్లీషు, హిందీ అనర్గళంగా మాట్లాడ గలిగిన మంచి మాటకారి, గృహ కృత్యాల్లో ఆరి తేరినదీ, స్ఫురద్రూపీ ఐదడుగుల రెండంగుళాలు తక్కువకాని ఎత్తు, వుంగరాల జుట్టూ వుండాలి. తల్లిదండ్రులూ, సోదర సోదరీ మణుల బాధ్యతలు లేని వధువుకు ప్రాధాన్యం - వివరాలు బాక్సు నెం: 123, 'నారీలోకం', వడపళని, మదరాస్ - 26''

❖❊❖❊❖

ప్రకటన కర్త
బాక్సు నెం: 123
'నారీలోకం', మదరాస్-26.
ఆర్యా!

మీ ప్రకటన చూశాను. మీకు కావలసిన వధువుకు వుండాల్సిన అర్హతలు రాశారు గాని - వరుడి వివరాలు తెలుపలేదు, '45 సం॥ల యువకుడు' అన్నారు - 45 సం॥లు అంటే అతను మధ్య వయస్కుడే! ద్వితీయమా ప్రథమ వివాహమా తెలుప లేదు. అతని ఆస్తి పాస్తులూ సాలుసరి ఆదాయం కూడా తెలుపలేదు. ఆ వివరాలు తెలుపకోరుతూ

నా చిరునామా వున్న కవరు జతపరుస్తున్నాను, మీ సమాధానం కోసం ఎదురుచూసే

భవదీయుడు
కప్పగంతుల సీతారామశాస్త్రి వ్రాలు
హైద్రాబాదు

❖❊❖❊❖

ప్రకటన దారుడు,
బాక్సు నెం: 123,
'నారీలోకం', మదరాస్- 26
మహాశయా !
నమస్కారం.

మేమూ తెలుగు వాండ్లమే మా తాతాలు నేటి తమిళనాడుకు ఈనాటి ఆంధ్రానించి వచ్చి పూడిసినారు. నాకు ఆంధ్రము అంతగా రాదు, చందమామ వంటి తెలుగు పుస్తకములు చదువు తాము. ఇంటిలో తెలుగునే పేసతాము.

నాకు భార్య లేదు. తంజావూరులో చిన్న పొలమూ, ఇల్లూ వుండినవి. ఒకే ఒక కూతురు, ఇక్కడ ఎం.ఏ., ప్యాసై టీచరుగా పనిచూస్తున్నది. మీరు తల్లిదండ్రులు బాధ్యతలేని పిల్లను కోరితిరి. 70 ఏండ్ల వయసువచ్చిన నేను, నా పిల్లలకు కళ్యాణం చేసి, ఎక్కడికి పోదును? నన్ను విడిచి పోవలసి వచ్చుననే నా కూతురు పెళ్లి వాయిదా వేస్తున్నది. మీరు దయపెట్టి మంచి మనసుతో అంగీకరిస్తారని ఆశతో వుందుము. నమ్రి - వణక్కమ్.

పి.వి. కృష్ణయ్యర్,
తంజావూరు

❖❊❖❊❖

ప్రకటన దారుడు
బాక్సు నెం: 123
'నారీలోకం', మదరాస్- 26
అయ్యా !

మా ఇంటి పేరు కీర్తివారు, ఇంటిపేరేకాదు మా వీధిపేరు కూడా అదే. రాజమండ్రి స్టేషన్‌లో దిగి, ఏ రిక్షావాడిని అడిగినా మా ఇంటికి తీసుకు వస్తాడు. మా ఇంటికి నా పేరు వున్న బోర్డు వుంటుంది.

నాకు నలుగురు ఆడపిల్లలు, అందరూ బాగా చదువుకున్నారు. స్ఫురదూపి అయిన అమ్మాయి, ఉంగరాల జుట్టు కలిగి వుండా లన్నారు. ఓ వంద రూపాయలు ఇస్తే, మదరాస్‌లో సాదాజుట్టును వుంగరాలుగా చుట్టతారటగదా! అబ్బాయి జుట్టు గురించి రాయలేదు, అతనికి బట్టతల ప్రారంభమైనదా, జుట్టు నెరవడం ప్రారంభం కాలేదా?

అమ్మాయి స్ఫురద్రూపి అయి వుండాలని అబ్బాయి అనుకున్నట్లే అబ్బాయికూడా అందగాడై వుండాలని అమ్మాయి అనుకోడం తప్పుకాదుకదా? అయినా, ఈ అందచందాలు తాత్కాలికమే. కీర్తి, ప్రతిష్టలే శాశ్వతాలు. మీనించి జవాబుకోసం ఎదురుచూస్తాను - మా అమ్మాయి వివరాలు వేరే కాగితం మీద రాసి జతపరుస్తున్నాను.

నాకు సొంత ఫోను లేదు. పక్కింటి ఫోన్ నెం: 2327 నన్ను పిలవమంటే పిలుస్తారు (ఉదయం 8 గం॥ నుండి రాత్రి 8గం॥ వరకు)

మీ
కీర్తి అనామకరావు
రాజమండ్రి

❖❊❖❊❖

ప్రకటన కర్త
బాక్సు నెం : 123,
'నారీలోకం', మదరాస్- 26
ఆర్యా !
మీ ప్రకటన చూశాను,

మనలాంటి అగ్రవర్ణాలకు ఈ రిజర్వేషన్ యుగంలో ప్రభుత్వ, బ్యాంక్, ఇన్సూరెన్స్ కంపె నీల్లో వుద్యోగాలు దొరకడం ఎంతకష్టమో మీకు తెలియనిది కాదు

వరుడు ఏ వుద్యోగం చేస్తున్నాడో తెలుపలేదు. అతని సాలుసరి ఆదాయము తెలుపలేదు.

మా అమ్మాయి స్త్రీలకు సంబంధించిన దుస్తుల తయారీ చేస్తున్నది. ఆమెతో మరో అయిదుగురు పనిచేస్తున్నారు. నెలకు కనీసం 3,4 వేల రూపాయలు ఆదాయం వస్తున్నది. దయచేసి మీ అభిప్రాయం తెలుపగోరతాను.

ఇట్లు
కె.వి. రావు,
విజయవాడ

❖❊❖❊❖

ప్రకటన కర్త,
బాక్సు నెం: 123,
'నారీలోకం', మదరాస్- 26
ఆర్యా!

మీ ప్రకటన పత్రికలో చూశాను. చాలా సం తోషం. స్వపరిచయం, నేను కోనసీమ బ్రాహ్మణు డను, ఆరువేల నియోగిని, గత నలభై సంవత్స రాలుగా మదరాస్‌లోనే వుంటున్నాను. స్థిర నివాసం ఇక్కడనే. చలనచిత్ర పరిశ్రమలో పనిచేస్తున్నాను.

నాకు నలుగురు అమ్మాయిలు - కొడుకులు లేరు. ముగ్గురు అమ్మాయిలూ పెళ్ళిళ్ళయి స్థిర పడ్డారు. (వారి వివరాలు వేరే కాగితంలో వున్నాయి.)

ఇప్పుడు పెళ్ళికి వున్న అమ్మాయి ఎం.ఎ.బి.ఇడి.పాసై-మదరాస్‌లో ప్రముఖ విద్యాసంస్థగా చెప్పబడుతున్న విద్యావిహార్‌లో టీచరుగా పని చేస్తున్నది. సాయంత్రం ఇంటి వద్ద ఆడపిల్లలకు వీణ పాఠాలు చెబుతుంది. నెలకు నాలుగువేలు పైన ఆదాయం వస్తుంది.

మీకు మాతో సంబంధం అంగీకారమైతే, అబ్బాయి వివరాలు తెలుపగోరతాను. మాకు జాతకాల పట్టింపులేదు. మాకు అబ్బాయి, అమ్మాయి ఒకరికొకరు నచ్చడమే ప్రధానం. అయినా, మీకు అవసరం అంటారేమోనని అమ్మాయి జాతకం, ఫోటో కూడా పంపుతున్నా. త్వరగా పరిష్కారం అవుతుంది.

సెలవ్

ఇట్లు

వ్యాఘ్రేశ్వరరావు

మదరాస్.

❖✻❖✻❖

ప్రియమైన వ్యాఘ్రీ

ఇలా సంబోధిస్తున్నందుకు ఆశ్చర్యంగా వుందా? నేనేరా- బాబిగాణ్ణి - అదే - చిన్నప్పుడు అంటే సుమారు 50 సం॥క్రితం మీ వూళ్లో గుడి మంటపం మీంచి నేను కాలు జారి పడిపోబోతూంటే - నువ్వు నా రెండు చేతులూ పట్టుకుని, నన్ను కాపాడావు. తర్వాత ఎవరో నిచ్చెన తెచ్చివేస్తే, నేను క్షేమంగా దిగాను.

ఆనాడు ఆవిధంగా నాకు ప్రాణదానం చేశావు. ఈనాడు కన్యాదానం చేస్తానంటున్నావు. చాలా సంతోషం. నా ప్రకటనచూసి చాలా సమాధానాలు వచ్చాయి. కాని, నాకు నీ వుత్తరం నచ్చింది. నీవుత్తరం మా చిరంజీవికి (అదే మా అబ్బాయికి) చూపిస్తాను. వాడు శుక్రవారం రాత్రి ఇక్కడకు వస్తాడు. ఆదివారం వెళ్లిపోతాడు. వాడితో మాట్లాడి వుత్తరం రాస్తాను. వాడు నామాట కాదనడు. ఏదోలాంఛన ప్రాయంగా అడగడం - అమ్మాయిని చూడ్డం బాగుందనుకోడం, ఇచ్చిపుచ్చుకోడాలు అనుకోడం, అంతే! పెళ్లి మాత్రం తిరపతిలోనే చెయ్యాలి.

వాడితో మాట్లాడి నీకు శుభవార్త తెలుపుతాను.

నీ

బాబి

(మంత్రిప్రగడ భాస్కరరావు)

ప్రకటనకర్త - బాక్సు నెం: 123

'నారీలోకం' - మదరాస్

❖✻❖✻❖



ప్రియమైన బాబీ!

నీ ఉత్తరం చేరింది.

నేనింత వరకూ ఓ వందమందికి వుత్తరాలు రాసి వుంటాను. నా ఎడ్రసుతో కవర్లు కూడా జతపరిచాను, సమాధానం ఇచ్చినవారు చాలా తక్కువ ఇంత ఆప్యాయతతో, చిన్ననాటి స్నేహాన్ని గుర్తుంచుకుని రాశావు. ఆస్నేహం బంధుత్వంగా మారే శుభదినం కోసం ఎదురుచూసే

నీ

వ్యాఘ్రీ

❖✻❖✻❖

వ్యాఘ్రీ!

నీ వుత్తరం చేరింది

మా వాడు మొన్న శని ఆదివారాలు వచ్చాడు. వాడితో నేనూ, మీ చెల్లెలు (అదే మా ఆవిడ) పెళ్లి గురించి చర్చించాము. అమ్మాయి జాతకం, ఫోటో చూశాను. ఫోటో నచ్చినా జాతకంలో పొంతన లేదన్నాడు. (వాడు జ్యోతిషంలో ప్రవీణుడులే!)

కాని - ఒక విషయం ఇక్కడ రాస్తాను.

మా వాడు స్పృశించిన ఫోటోలో అమ్మాయిలకి - వాడు స్పృశించిన ఆరు మాసాల్లో పెళ్లిళ్లు జరిగాయి. ఇలా ఒకటికాదు - రెండు కాదు ఆరు పెళ్లిళ్లు జరిగాయి. త్వరలోనే నీ నుండి శుభలేఖ కోసం ఎదురు చూస్తాను.

నీ

బాబి.

❖✻❖✻❖

ప్రియమైన బాబీ!

నీ వుత్తరం చేరింది.

ఎంత 'మంచి హస్తం' రా మీ అబ్బాయిది?

నాకు తెల్సిన అయిదారుగురు ఆడపిల్లల తండ్రులున్నారు. వారికి నీ ఎడ్రసు ఇస్తున్నాను. వారు ఫోటోలు పంపుతారు. మీ అబ్బాయిని ఆ అమ్మాయిల ఫోటోలు స్పృశించి పంపమను. వారికీ ఆరుమాసాల్లో పెళ్లిళ్లు జరగాలని నా అభిలాష!

ఇక్కడ మరో విషయం నీకు చెప్పితీరాలి. బాల్య మిత్రుడి దగ్గర దాపరికం మంచిది కాదు కదా! మా అమ్మాయిని నిరాకరించిన అయిదారుగురికి - ఇంత వరకూ పెళ్లిళ్లు జరగలేదు. ( నేను మా అమ్మాయికి పెళ్లి చేయాలని గత 7సం॥ నించి ప్రయత్నిస్తూనే వున్నాను.)

నీ

వ్యాఘ్రీ

❖✻❖✻❖

తరవాత నెల 'నారీలోకం' లో 'వధువు కావలెను' ప్రకటన మళ్లీ వచ్చింది.